క్లుప్తంగా

అక్రమ కేసులు పెట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలి

సంతనూతలపాడు: గుంటూరు జిల్లా తెనాలిలో దళిత మైనార్టీ యువకులపై అక్రమ కేసులు పెట్టి బహిరంగంగా శారీరకంగా హింసించిన త్రీటౌన్ సీఐ రమేష్‌బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంకె సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలులో అగ్రకులాలకు అన్యాయం జరిగితే తక్షణమే హోం మినిస్టర్ అనిత వచ్చి పరామర్శించారని, తెనాలిలో దళిత మైనార్టీ యువకులపై పోలీస్ శాఖ దాడిచేసినా నేటికీ రాష్ట్ర హోం శాఖ, సాంఘిక సంక్షేమ శాఖామంత్రులు పరామర్శించకపోవడం దారుణమని అన్నారు. దళితులకు అన్యాయం జరిగితే ఎస్సీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరువిప్పి ఖండించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందుకు బాధ్యులైన సీఐ రమేష్‌బాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

నాగులుప్పలపాడు: శాంతిభద్రతలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ ఎస్సై షేక్ రజియా సుల్తానాతో కలిసి మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో శాంతి భద్రతలపై సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య జరిగిన నేపథ్యంలో ఆ కేసుకు సంబంధించి అమ్మనబ్రోలు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరువర్గాల వారిని బైండోవర్ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనకు కారకులైన వారికి సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్సై రజియా సుల్తానా కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

కార్మికుల ఐక్యతకు సీఐటీయూ కృషి

చీమకుర్తి: కార్మిక, కర్షకుల ఐక్యతకు సీఐటీయూ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి 1970 మే 30వ తేదీ సీఐటీయూ ఏర్పడిందన్నారు. కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసి లేబర్ కోడ్స్ తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ యువతకు ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోందంటూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని వ్యతిరేకిస్తూ జూలై 9న చేపట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు, స్థానిక కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల పదోన్నతికి సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్

ఒంగోలు సిటీ: జిల్లా విద్యాశాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ నుంచి పీఎస్ హెచ్‌ఎం పదోన్నతికి సంబంధించిన సీనియారిటీ జాబితాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలోని 46 ఖాళీలకు 138 మందితో జాబితా, ప్రభుత్వ యాజమాన్యంలో 3 ఖాళీలకు 9 మందితో జాబితా, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో 7 ఖాళీలకు 21 మందితో జాబితా, మున్సిపల్ యాజమాన్యంలోని 12 ఖాళీలకు 36 మందితో జాబితా ఉంచినట్లు డీఈఓ తెలిపారు. వీరందరూ ఈ నెల 31వ తేదీన శనివారం సర్వీస్ పుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్‌లతో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు హాజరు కావాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలి

● నగరంలో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించిన ఎస్ఈ


పరిశీలిస్తున్న ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా భద్రత చర్యలు పాటిస్తున్నారా లేదా అని స్వయంగా తనిఖీలు చేసి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద బిగించిన మీటర్‌లను పరిశీలించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, వాటి వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకం పీఎం సూర్య ఘర్‌ను జిల్లా ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. డీఈఈ పాండురంగారావు, ఏఈఈ సంతోష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా థియేటర్ల తనిఖీ


కొత్తపట్నం: గ్యాస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ గోపాల్‌కృష్ణ


మద్దిపాడు: గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

● రేషన్ షాపులు, టపానుల గోడౌన్లు కూడా..

ఒంగోలు సబర్బన్: నగరంలోని పలు సినిమా థియేటర్లను రెవెన్యూ అధికారులతో కలిసి ఒంగోలు ఆర్‌డీఓ కె.లక్ష్మీప్రసన్న శుక్రవారం తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు థియేటర్లలోని పరిస్థితులను నిశితంగా పరిశీలించారు. క్యాంటీన్లలో ప్రజలకు అవసరమైన వస్తువులు, తినుబండారాలు, పానీయాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం నగరంలోని పెట్రోల్ బంకులు కూడా పరిశీలించారు. రేషన్ షాపులు, టపాసులు గోడౌన్లను తనిఖీ చేశారు. నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించి రికార్డులు కూడా తనిఖీ చేశారు. ఆర్‌డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకంఠ శ్రీనివాసరావు ఉన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మండల రెవెన్యూ అధికారి ఆర్.బ్రహ్మయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కూనంనేనివారిపాలెం, ఏలూరువారిపాలెం గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను సందర్శించి తాగునీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం గోనుగుంట గ్రామంలో లలిత ఫిల్లింగ్ స్టేషన్లో పెట్రోల్, డీజిల్ కొలతలు, నాణ్యతను తనిఖీ చేశారు. చీమకుర్తి పట్టణంలోని సాయినాథ్ గ్యాస్ ఏజెన్సీ, సివిల్ సప్లయిస్ గోడౌన్, కేత్రీకే సినిమా థియేటర్, పట్టణంలోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులు, పెట్రోలు బంకుల తనిఖీ

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో బాయిల్డ్ రైస్ మిల్లును తహసీల్దార్ నారాయణరెడ్డి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లులో వడ్లు ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారు, ఏ రకం బియ్యం ప్యాక్ చేస్తున్నారనే అంశాలను పరిశీలించారు. ఉదయం పెట్రోలు బంకు, వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో కొలతలు సరిగా ఉన్నాయా..లేదా.? పెట్రోలు నాణ్యత, వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఐ వంశీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఒంగోలు సబర్బన్: ఓ పెట్రోల్ బంకులో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న

కొత్తపట్నంలో జేసీ తనిఖీలు

కొత్తపట్నం: మండలంలో జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకుమార్‌లు శుక్రవారం పలు గ్యాస్ ఏజెన్సీలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తొలుత అల్లూరు కేశవరపు ఇండస్ట్రీల్ రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. బియ్యం నాణ్యత, ఎంత స్టాక్ ఉంది.. వంటి వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అల్లూరులో రేషన్ షాపును తకిఖీ చేశారు. షాపులో బియ్యం, చక్కెర తకిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చే వెహికల్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి షాపులో రేషన్ బియ్యం, సరుకులు ఇవ్వాలని రేషన్ షాపు నిర్వాహకుడు మాధవదాసును ఆదేశించారు. ఆ తర్వాత కొత్తపట్నంలో శాంతి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఎంత స్టాక్ ఉంది, వినియోగదారులకు ఎటువంటి గ్యాస్ బండలు ఇస్తున్నారో నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


చీమకుర్తి రూరల్: కూనంనేనివారిపాలెంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య


చీమకుర్తి రూరల్: గోనుగుంటలో ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న మండల అధికారులు

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న

● ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న

ఒంగోలు సబర్బన్: ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఒంగోలు ఆర్‌డీఓ కె.లక్ష్మీప్రసన్న కోరారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో శుక్రవారం ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మీటింగ్ పెట్టినట్లు తెలిపారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారి ఓట్లు తొలిగించనున్నట్లు స్పష్టం చేశారు. ఒంగోలు నియోజకవర్గం ఓటర్ల జాబితా ఎటువంటి తప్పులు లేకుండా సరిచేస్తున్నామని, 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓట్లు నమోదు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లు తొలిగించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ బూతుల్లో సౌకర్యాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. సలహాలు, సూచనలను పార్టీల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ఆధార్ అనుసంధానం ఎంత శాతం జరిగిందని, ఆధార్ అనుసంధానం చేసుకోని వారికి మీరిచ్చే సూచనలు ఏమిటని ప్రశ్నించారు. నగరంలో డోర్ నంబర్ల సమస్య ఉందని, అన్ని డివిజన్లలో డోర్ నంబర్లు లేవని, కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి పెద్ద సమస్యగా ఉందన్నారు. వెంటనే నగరంలో డోర్ నంబర్లు వేయించాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లు వెంటనే తొలిగించాలని, నగరంలో కొన్ని పోలింగ్ స్టేషన్లు ప్రైవేటు స్కూల్స్‌లో ఉన్నాయని, తమ స్కూల్స్ వాటిని తొలిగించాలని కొన్ని స్కూల్ యాజమాన్యాలు కోరుతున్నాయని ఆర్‌డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ ఆలోచించి వారిపై చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ రిపోర్ట్ చెయ్యాలని దామరాజు క్రాంతికుమార్ కోరారు. కార్యక్రమంలో ఒంగోలు మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శివప్రసాద్, ఒంగోలు డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌తో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డులివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి, వ్యవసాయ శాఖాధికారి రమేష్

మద్దిపాడు: మండలంలోని ప్రతి కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వీఆర్వోలు, వీఏఏలకు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఆర్సీ కార్డుల ద్వారా సాగుదారు బ్యాంకు నుంచి ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.1,60,000 వరకు రుణం పొందవచ్చని తెలిపారు. పంట నష్టం జరిగితే బీమా పథకం, 0 వడ్డీ లబ్ధి, కనీస మద్దతు ధర చెల్లింపు, పంట కొనుగోళ్లు వంటివాటికి కూడా ఈ పత్రం ఉపయోగపడుతుందన్నారు. అసలు భూమిలేని కౌలు రైతులు ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలయితే గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేయించుకుని ప్రభుత్వం ఇచ్చే పథకానికి అర్హులు కావచ్చని తెలిపారు. భూ యజమానులు సాగు హక్కు పత్రంపై సంతకం పెట్టడం ద్వారా రైతు భూ హక్కులకు ఎటువంటి భంగం కలగదని తెలిపారు. సాగుదారు తీసుకున్న పంట రుణం తీర్చే విషయంలో జాప్యం జరిగినా భూ యజమానికిగానీ, సదరు భూమికిగానీ ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ పత్రం కాలపరిమితి మూడు నుంచి పదకొండు నెలలు ఉంటుందన్నారు. దేవదాయ శాఖ భూములు సాగుచేస్తున్న వారు కూడా ఈ పత్రం పొందడానికి అర్హులని తెలిపారు. వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో మండలంలో 1305 మందికి సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

బాలల సంరక్షణ, సంక్షేమం ప్రధానం

● జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు
● చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ డిస్ట్రిక్ట్ లెవల్ రికమెండింగ్ కమిటీ సమావేశం


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు సబర్బన్: బాలల సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమం ప్రధానంగా చూసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు చెప్పారు. స్థానిక డీఆర్ఓ చాంబర్‌లో శుక్రవారం బాలల సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా ప్రొబేషన్ అధికారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వహించుటకు దరఖాస్తు, సంరక్షణ గృహాలు తనిఖీ అనంతరం రిజిస్ట్రేషన్ అనుమతి కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించామని డీఆర్ఓ పేర్కొన్నారు. జిల్లాలో చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ డిస్ట్రిక్ట్ లెవెల్ రికమెండింగ్ కమిటీ అనుమతి కోసం జిల్లా పరివేక్షణ అధికారి నోడల్ ఆఫీసర్‌గా పి.బాల ప్రభాకర్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, బాలల న్యాయ చట్టం–2015 అనుసరించి చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వహించేందుకు 3 ప్రభుత్వ, 8 స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనలో సీఐటీయూ పాత్ర కీలకం


మున్సిపల్ కార్మికుల పని ప్రదేశంలో..


సీఐటీయూ కార్యాలయం వద్ద జండావిష్కరణ చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని లక్షలాది కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన సీఐటీయూ కీలకపాత్ర పోషిస్తోందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి గంటెనపోగు శ్రీనివాసరావు చెప్పారు. 1970 నుంచి నిరంతర ఉద్యమాలు నిర్మిస్తోందన్నారు. యావత్ కార్మిక లోకం ఐక్య పోరాటాల ద్వారా సాధించిన హక్కులు నేడు ప్రమాదంలో పడ్డాయని, వాటిని కాపాడుకునేందుకు మరింత అంకిత భావంతో పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ఎర్రజెండా ఎగరేసి 55వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటెనపల్లి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లను గుర్తించాలని అనేక పోరాటాలను చేసినట్లు గుర్తు చేశారు. విశాఖ ఉక్కును రక్షించుకునేందుకు 1500 రోజుల నుంచి నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, నగర కార్యదర్శి మహేష్, పోకల ప్రసాద్, కోటేశ్వరరావు, మున్నాబాషా, తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పని ప్రదేశాల్లో..

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 26 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను బహుళజాతి కంపెనీల యాజమాన్యానికి ఊడిగం చేసే పద్ధతిలో తీసుకొస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ పని ప్రదేశాల్లో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలైతే భవిష్యత్తులో కార్మిక హక్కులు ఉండవని, కనీసం యూనియన్లు స్థాపించుకునే హక్కు కూడా ఉండదన్నారు. పని గంటలు సైతం 90 గంటల నుంచి 120 గంటలకు పెంచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సమస్యలపై జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని నగర కార్యదర్శి టి.మహేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.శ్రీదేవి, పద్మ, తంబి శ్రీనివాసరావు, సీహెచ్ అక్కేశ్వరరావు, సింహాద్రి, వై.రవికుమార్, కె.శ్రీనివాసరావు, ఎం.బాబు పాల్గొన్నారు.

క్షయ బాధిత గ్రామాలపై దృష్టి పెట్టాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: టీబీ బాధితులు ఎక్కువగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో టీబీ ఫోరం, టీబీ ముక్త భారత్ అభియాన్ సమావేశం నిర్వహించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ వాల్‌పోస్టర్లను అధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. క్షయవ్యాధి సంభవం, మరణాల రేటుపై గణనీయమైన ప్రభావాన్ని చూపే లక్ష్యంతో ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, పోషకాహార లోపం ఉన్నవారు, ధూమపానం చేసేవారు, మద్యపానం చేసేవారు, గతంలో టీబీ బారిన పడినవారు, వారి దగ్గరి పరిచయస్తుల స్క్రీనింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. 2023లో ప్రకాశం జిల్లాలో టీబీ రహితంగా గుర్తించిన ఏడు పంచాయతీలకు కాంస్య విగ్రహం, 2024లో గుర్తించి ఏడు పంచాయతీలకు సిల్వర్ విగ్రహాలను జేసీ చేతులమీదుగా అందజేశారు. మరో 65 పంచాయతీలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ.. టీబీ నిర్మూలనలో పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఉపిరితిత్తుల విభాగం అధిపతి డాక్టర్ రంజిత్ బాషా, ఆస్టర్ రమేష్ ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ జహంగీర్ సుల్తాన్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

శ్రీరామచంద్రుడికి పునర్వసు నక్షత్ర పూజలు


సీతా సమేత అనంత కోదండరామస్వామి

ఒంగోలు మెట్రో: శ్రీరామచంద్రుడు జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామ మందిరాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వలేటివారిపాలెం కోదండరామస్వామి దేవస్థానం (రామక్షేత్రం) ప్రధాన అర్చకుడు నారాయణం కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మూలవిరాట్లకు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కోదండరామస్వామి పూజలో భక్తులు